సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



మట్టి ప్రతిమలకే మొగ్గు

గణేశ్ వేడుకల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు రసాయనలేమి విగ్రహాలను కొలిచేందుకు ప్రజలు మొగ్గు చూపిస్తున్నారు. 2లో▸



తాళం వేసిన ఇంట్లో చోరీ

తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నగదు, బంగారు ఆభరణాలు తస్కరించారు. 2లో▸

సివిల్ సర్వీసెస్ పరీక్ష కేంద్రాల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష జరుగుతున్న కోఠి ఉమెన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని శనివారం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. అక్కడ చేసిన ఏర్పాట్లను కళాశాల ప్రిన్సిపాల్‌ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి హాల్‌కు వెళ్లి పరిశీలించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించాలని సూచించారు.



సభా వేదిక కోసం ఏర్పాట్లు



దారిలో వెలిసిన భారీ ఫ్లెక్సీలు

హస్తం..'భేరి'కి సిద్ధం

నేడే కాంగ్రెస్ విజయభేరి సభ

- దారులన్నీ తుక్కుగూడ వైపే..
- కటౌట్లతో నింపేసిన కార్యకర్తలు
- జనసమీకరణకు ప్రత్యేక బస్సులు
- భారీగా తరలిరావాలని నేతల పిలుపు
- పోలీసుల పటిష్ట బందోబస్తు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/తుక్కుగూడ: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తుక్కుగూడ వేదికగా ఆదివారం సాయంత్రం నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ విజయభేరి సభకు సర్వం సిద్ధమైంది. ఫ్యాబ్‌సిటీ సమీపంలోని వంద ఎకరాల విస్తీర్ణంలో భారీ సభా వేదికను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, యువనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సహా సీడబ్ల్యూసీ ముఖ్యులు, అన్ని రాష్ట్రాలకు చెందిన పీసీసీ అధ్యక్షులు, డీసీసీలు, అనుబంధ సంఘాల నేతలు హాజరు కానుండటంతో పీసీసీ ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నియోజకవర్గాల వారీగా భారీగా జనాన్ని సమీకరించేందుకు 300 బస్సులను సిద్ధం చేసింది. పోలింగ్ బూతులు, బస్తీలు, గ్రామాల వారీగా బస్సులను పంపింది. నియోజకవర్గ ముఖ్య నేతలు సైతం ప్రత్యేక వాహనాల్లో కాకుండా కార్యకర్తలతో పాటే ఆయా బస్సులు, డీసీఎంలలోనే సభాస్థలికి చేరుకోనున్నారు.

రెయిన్ ప్రూఫ్ టెంట్లు

భారీ వర్షానికి సైతం నేతలు తడవకుండా ఉండేందుకు రెయిన్ ప్రూఫ్ టెంట్లను వేశారు. సభాస్థలిపై ఆసీనులైన ముఖ్యనేతల ముఖాలతో పాటు వారి ప్రసంగాలు స్పష్టంగా వినిపించేందుకు సభాస్థలికి నాలుగు వైపులా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం చుట్టూ పెద్ద సంఖ్యలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. తుక్కుగూడకు వచ్చిపోయే ప్రధాన మార్గాలతో పాటు ఫ్యాబ్‌సిటీలోకి ప్రవేశించే ప్రధాన దారి వెంట స్వాగత తోరణాలు, భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల నేతలు ఈ విషయంలో పోటీపడ్డారు. సీడబ్ల్యూసీ ముఖ్య నేతల కోసం ప్రధాన వేదికను కేటాయించారు. పీసీసీలు, మాజీ మంత్రులు, ఎంపీల కోసం ఒకటి.. డీసీసీలు, అనుబంధ సంఘాల నేతలు, కళాకారుల కోసం మరో స్టేజీని కేటాయించారు. ఈ మూడు వేదికలపై సుమారు 250 మంది ఆసీనులు కానున్నారు. ప్రధాన వేదికకు ముందు భాగంలో మీడియా గ్యాలరీ సహా మహిళలు, ముఖ్య నేతల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేసి, వాటి చుట్టూ బారీకేడ్లు ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ముఖ్య నేతల వాహనాలను ప్రధాన వేదిక వెనుక భాగంలోనే పార్కింగ్ చేయించనున్నారు. ఇతర నేతలు, కార్యకర్తల వాహనాల కోసం సర్వీసు రోడ్డుతో పాటు ఆ ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను కేటాయించారు.

చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు

విజయభేరి సభకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలంతా హాజరు కానుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఆ సభా ప్రాంగణాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. తుక్కుగూడకు వచ్చి వెళ్లే నాలుగు ప్రధాన రహదారులపై భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తులో ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, 61 మంది మంది ఎస్‌ఐలు, 600 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించనున్నారు. రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సభావేదికకు నలువైపులా నాలుగు పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటలకు తాజ్‌కృష్ణ హోటల్ నుంచి బయలుదేరే ముఖ్య నేతల వాహనాలు శంషాబాద్ నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా తుక్కుగూడకు చేరుకుంటాయి. అటు నుంచి ర్యాలీగా ప్రధాన వేదిక వెనుకభాగంలోని ఫ్యాబ్ సిటీ నుంచి సభాప్రాంగణానికి అనుమతించనున్నారు. మిగిలిన వాహనాలను ప్రధాన రహదారి నుంచి అనుమతించనున్నారు.

భారీగా తరలిరండి

విజయభేరి సభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి దేప భాస్కర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్లలోని పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం గడ్డపై తొలిసారిగా 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

విజయవంతం చేయండి

మీర్‌పేట: తుక్కుగూడలో ఆదివారం జరగనున్న విజయభేరి బహిరంగ సభను పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అరాచకాలను సభలో ఎండగడతామని అన్నారు. సమావేశంలో నాయకులు అమరేందర్‌రెడ్డి, బంగారు బాబు, కీసర యాదిరెడ్డి, సామిడి గోపాల్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సోమ భూపాల్‌రెడ్డి, గంగమ్మ, సురేందర్‌రెడ్డి, అరుణ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

న్యాయ అంశాలపై అవగాహన మేలు

చేవెళ్ల సీనియర్ సివిల్‌కోర్టు జడ్జి శ్రీదేవి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌కోర్టు జడ్జి శ్రీదేవి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ లీగల్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. మండలకేంద్రంలోని శ్రీచైతన్య కళాశాలలో శనివారం న్యాయశాఖ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పలు న్యాయ సంబంధమైన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ముఖ్యంగా సోషల్ మీడియా దాని దుష్పలితాల గురించి తెలుసుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, కళాశాలలకు మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలతో చదువుకుంటే భవిష్యత్తుల్లో రాణిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు చూపించిన మార్గాల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బి.యాదిరెడ్డి, సీఐ లక్ష్మారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శేఖర్, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



అమరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మంచాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండల పరిధిలోని ఎల్లమ్మ తండాలో తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన గునుకుల మల్లయ్య, సోమయ్య సమాధులను ఆయన శనివారం సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగం మరువ లేనిదని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ప్రజా పోరాటాలను ముందుండి నడిపింది సీపీఎం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్, నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరామర్శ



విద్యార్థినులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

మంచాల: బీసీ బాలికల వసతి గృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ శనివారం రాత్రి వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖైరతాబాద్ మహాగణపతికి 75 అడుగుల భారీ కండువా



ఖైరతాబాద్: మహాగణపతికి భారీ కండువా, జంధ్యం, గరిక మాలతో పాటు దేవతామూర్తులకు సమర్పించే పట్టు వస్త్రాలకు ఖైరతాబాద్ పద్మశాలి సంఘం సభ్యులు శనివారం పూజలు నిర్వహించారు. శ్రీ దశమహా విద్యా గణపతిగా కొలువుదీరిన మహాగణపతికి సోమవారం వినాయక చవితి రోజున ఉదయం 7 గంటలకు 75 అడుగుల కండువా, జంధ్యం, గరికమాలను సమర్పిస్తున్నట్లు అధ్యక్షుడు కడారి శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు గుర్రం కొండయ్య తెలిపారు. మహాగణపతికి ఇరువైపులా కొలువుదీరిన వీరభద్ర స్వామి, నరసింహస్వామి, సరస్వతి దేవి, వారాహి దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

పక్కాగా పంచాయతీ పాలన

- 'ఈ-గ్రామ్ స్వరాజ్'తో అవకతవకలకు చెక్
- వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు
- చేపట్టిన పనులు, నిధుల ఖర్చు అన్నీ ఆన్‌లైన్
- పారదర్శకంగా ఆడిటింగ్ నిర్వహణ



షాబాద్: గ్రామ పంచాయతీల పాలనా వ్యవహారాల్లో పారదర్శకత కోసం, ప్రజలు సులభంగా అన్ని విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌ను తీసుకొచ్చింది. 2020లోనే ఈ యాప్ అందుబాటులోకి వచ్చినా అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. ఇటీవల యాప్‌ను మరింతగా తీర్చిదిద్ది అందుబాటులోకి తెచ్చారు.

ఎందుకింత ప్రాధాన్యం..?

చాలాచోట్ల పంచాయతీ పాలకవర్గాలు చేస్తున్న నిధుల ఖర్చు తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టాన్నే వినియోగించుకుంటున్నారు. ఆ చట్టం మంచిదే అయినా అగిడిన సమాచారం తీసుకోవటానికి కొంత సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో అరచేతిలో క్షణంలో ఏ గ్రామ పంచాయతీ వివరాలు కావాలనుకుంటే అవి, నిధులు, వ్యయ వివరాలు సులభంగా తెలుసుకునేలా కేంద్ర ప్రభుత్వం ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌నకు రూపకల్పన చేసింది. పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి కోసం జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంస్థ ద్వారా నిధులను విడుదల చేస్తోంది. వీటికి తోడు పంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా కొంత నిధి జమవుతూ ఉంటుంది. ఈ నిధులను 25 శాతం పారిశుద్ధ్య నిర్వహణకు, 25 శాతం తాగునీటి సరఫరా, విద్యుత్ బిల్లుల చెల్లింపులకు, 50 శాతం పంచాయతీల నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులకు వినియోగించాలి. ఈ నిబంధనలు ఎప్పటినుంచో ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా అమలు చేయక తక్కువ పనులు చేసి ఎక్కువ బిల్లు తీసుకోవడం, అక్రమాలకు పాల్పడడం వంటివి జరిగేవి. పంచాయతీల నిర్వహణపై పారదర్శకత ఉండేది కాదు. ఈ యాప్ అమలుతో అవకతవకలు నివారించే అవకాశం ఉండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

558 పంచాయతీల్లో అమలు..

జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీల్లోనూ ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్ అమలులోకి వచ్చింది. ఈ పంచాయతీలకు వస్తున్న నిధులు, చేస్తున్న వ్యయం, చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు సంబంధిత కార్యదర్శులు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆడిటింగ్ నిర్వహణ కూడా సక్రమంగా జరుగుతోంది. గతంలో పంచాయతీల్లో నిర్వహించే ఆడిటింగ్‌ల ద్వారా ఆడిటర్లు అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసేవారు. వారితో కుమ్మక్కై అభ్యంతరాలు లేకుండా చేసుకునేవారు. ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్ వచ్చిన తర్వాత గతంలో మాదిరిగా అవకతవకలు, అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉండే అవకాశం కలిగింది.

మూడేళ్ల క్రితమే..

పంచాయతీలకు ఇస్తున్న నిధుల వ్యయంపై కొరవడిన జవాబుదారీతనాన్ని కాపాడేందుకు, పంచాయతీల్లో పాలన పారదర్శకంగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కిత్రం 2020 ఏప్రిల్ 24న ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో పంచాయతీలకు వివిధ పద్దుల ద్వారా వస్తున్న నిధులు ఎన్ని, వీటితో ఏయే పనులు చేయాలి, సిబ్బంది జీతభత్యాల చెల్లింపులు, పంచాయతీల నిర్వహణ ఖర్చులు, ఏ పనికి ఎన్ని నిధులు ఖర్చు చేశారు.. పాలకవర్గాల సమాచారం తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. దేశంలోని అన్ని గ్రామ పంచాయతీల వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ పేరును క్లిక్ చేయగానే వివరాలన్నీ కనిపిస్తాయి. ఈ యాప్ వచ్చినప్పటి నుంచి పంచాయతీ పాలక వర్గాలు, కార్యదర్శులు నిధులను ఎడాపెడా ఖర్చు చేయకుండా ఒక పద్ధతి ప్రకారం నడుచుకుంటున్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై స్పష్టత ఇవ్వండి

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో చివరిదైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ కర్ణకోట రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు తట్టెడు మట్టిని ఎత్తకుండా పాలమూరు రంగారెడ్డి పథకం పూర్తయిందని బీఆర్‌ఎస్ పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవడం రాష్ట్ర ప్రజలను, ఉమ్మడి పాలమూరు జిల్లావాసులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. నార్లాపూర్‌లోని తొమ్మిది పైపులకు ఒక మోటారును మాత్రమే ప్రారంభించి రిజర్వాయర్‌ల పనులు 40శాతమే పూర్తి చేసి అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ఏ విధంగా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఇంజనీర్లు చేపట్టాల్సిన ట్రయల్ రన్‌ను సీఎం చేయడం సమంజసం కాదన్నారు. అధికారంలోకివస్తే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా లక్ష్మీదేవిపల్లిని నిర్మించి నియోజకవర్గ ప్రాంతానికి లక్ష ఎకరాలకు సాగు నీరందిస్తామని గత ఎన్నికల సమయంలో మాట ఇచ్చి ఉదండాపూర్ వరకే పరిమితం చేయడం అన్యాయమని అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను వెంటనే చేపట్టాలని, లేదంటే జూరాల బ్యాక్ వాటర్‌తో ప్రాజెక్టును నిర్మించి నియోజకవర్గానికి సాగునీరందించాలని డిమాండ్ చేశారు.

'డబుల్' ఇళ్లు స్థానికులకే ఇవ్వాలి



ధర్నాలో పాల్గొన్న నాయకులు, స్థానికులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మాధవాచారి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 5 లక్షల ఓట్లు ఉండగా అందులో 3 వేల మంది అర్హులు లేరా అని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ముస్లిం మైనార్టీలపై చూపిన ప్రేమ హిందువులపై చూపాలన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల ప్రజలకు మహేశ్వరంలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు ఇస్తున్నారని నిలదీశారు. స్థానికులకు న్యాయం జరగని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ నవతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కిసాన్‌మోర్చా సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని వినతి



జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ కోరింది. ఆశ వర్కర్లకు సరైన గుర్తింపు లేదని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ శనివారం జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సబ్‌సెంటర్స్, బస్తీ దవాఖానాల్లో పని చేయాలని ప్రభుత్వం చెబుతోందన్నారు. కేవలం రూ.9,750 మాత్రమే ఇస్తోందని, ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ కోశాధికారి శ్రీలలిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి భారీ వాహనాలు

2 వేల వాహనాలు ఏర్పాటు చేసేందుకు ఆర్టీఏ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: వినాయక ఉత్సవాల అనంతరం విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఇటీవల ఆర్టీఏ అధికారులతో సమావేశమయ్యారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు వాహనాలను అందజేయాలని కోరారు. ఈ మేరకు రవాణా అధికారులు ప్రస్తుతం వాహనాల సేకరణపై దృష్టి సారించారు. వివిధ ప్రాంతాల్లోని మండపాల నిర్వాహకుల డిమాండ్ మేరకు అవసరమైన వాహనాలను ఇవ్వనున్నట్లు హైదరాబాద్ జేటీసీ పాండురంగ్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు 2000 వాహనాలను అందుబాటులో ఉండేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జనానికి సొంతంగా వాహనాలను సమకూర్చుకోలేని నిర్వాహకులకు రవాణా శాఖ వాహనాలను సేకరించి ఇస్తోంది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతీయ రవాణా కార్యాల యాల్లో వాహనాల వివరాలను అందుబాటులో ఉంచనున్నారు.

'ఆయుష్మాన్‌భవ'పై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

మొయినాబాద్: ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా ఆభా కార్డులపై ప్రజలకు ఆశ వర్కర్లు అవగాహన కల్పించాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. మొయినాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్‌భవ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌ను ఆశా కార్యకర్తలకు ఇచ్చి తమ పేరును నమోదు చేయించుకోవాలన్నారు. ఆభా కార్డు తీసుకున్నవారికి దేశంలో ఎక్కడైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు వాణి, ప్రసాద్, సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

తేది: 13-09-2023

బి. రాజేశ్వర్ తండ్రి బి. ఈశ్వరప్ప షాద్‌నగర్ టౌన్ నివాసి అని అతను షాద్‌నగర్ టౌన్‌లోని జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళినప్పుడు రిజిష్టర్డ్ సేల్ డీడ్ నం 3196/2022 ద్వారా కొనుగోలు చేసిన షాద్‌నగర్ టౌన్ లో గల సర్వే నం 240/బి లోని అతని ఆస్తి అంటే ప్లాట్ నం 72ఎ మరియు 71ఎ లోని 82.50 చ.గజాల మరియు 41.88 చ.గజాలు మొత్తం 131.38 చ.గజాల విస్తీర్ణం గల అతని ఒరిజినల్ రిజిష్టర్డ్ సేల్ డీడ్ నం 14190/2007 (లింక్ డాక్యుమెంట్) పోగొట్టుకున్నారని సాధారణ ప్రజలకు ఇందుమూలముగ తెలియచేయడమైనది ఇది ఇలా ఉండగా అతని ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్‌ను అతను పోగొట్టుకున్నాడు. సదరు సేల్ డీడ్ ఎవరి స్వాధీనంలో నైనా కలిగి ఉన్న లేదా ఏదైన అభ్యంతరలు, హక్కులు లేదా క్లెయిమ్‌లు కలిగి ఉన్న ఏడు (7) రోజుల లోగా వారు దిగువ సంతకందారును సంప్రదించవచ్చును. అటువంటి క్లెయిమ్‌లు ఏవీ అందనట్లయితే, సదరు ఆస్తిపైన అభ్యంతరాలు, హక్కులు లేదా క్లెయిమ్‌లు ఏవీ లేవని భావిస్తూ మరియు సదరు డీడ్ వాస్తవంగా పోయినవని భావిస్తూ తమనిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తికి బ్యాంకు ఋణం ప్రాసెస్ చేస్తుంది మరియు ఏవేని తదుపరి క్లెయిమ్‌లు/హక్కులు స్వీకరించబడవు.

సం/- రాజమోలి వెంకట రామిరెడ్డి అడ్వకేట్, ఇంటి.నం: 7-4-14, 7-4-14/ఎ, గ్యాలాక్సీ హై స్కూల్ లేన్ ఎదురుగా, వెంకటేశ్వర కాలనీ, మహబూబ్‌నగర్ సెల్: 9963887711.

PUBLIC NOTICE

That the General public are hereby informed that my client Mr. DHARMAPURI BRAHMANANDAM S/o D. CHANDRAIAH, R/o H.No.1-60/5, Plot No. 65, Vivek Nagar Colony, Near Hanman Temple, Jillellaguda, Meerpet, Rangareddy District. TS has intending to purchase the open Plot No.18, admeasuring 200 Sq yards, in Sy No. 202 " MTS ENCLAVE" situated at Hythabad Village, Shabad Mandal, Rangareddy District., bounded by North: Plot No. 19, South: Plot No.17, East: Plot Nos 28 & 29, West: 30' Feets wide Road from MOHAMMED NAJAMUDDIN FAROOQUI S/o MOHAMMED INTESAR FAROOQUI R/o H.No. 17-9-567/A, Chowni Nade Ali Baig, Yakatpura, Hyderabad, T.S and his GPA holder MOHAMMED INTESARUDDIN FAROOQI S/o MOHAMMED HABEEBUR RAHMAN FAROOQI, R/o H.No. 17-8-142, Guddi Bowli, Near Masjid Rahmania, Yakatpura. Hyderabad, That my client to purchase the above property. If anybody is having any objection in respect of above transaction they shall informed to me within (5) days from the date of this publication otherwise my client will proceed with registration of sale deed and no claims will be entertained.

Sd/- V. BALASWAMY
Advocate
H.No.13-82/3, Behind Veerabadra Rice Mill, Shankarpally Road, Chevella Village & Mandal, Ranga Reddy District Cell No. 9440090524

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా సమస్త ప్రజానీకానికి తెలియ జేయునది ఏమనగా నా క్లైయింటు అయిన పలికేల రవీంద్ర ప్రసాద్ S/o వెంకటసుబ్బయ్య, R/o ఇంటి.నం: 13/595/2/3, R.K.M వీధి, శ్రీరాములు బజార్, కడప, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గార్లు రంగారెడ్డి జిల్లా, నందిగామ మండలం, చేగూరు గ్రామములోని సర్వే నం. 490/527/అ-ర, 490/527/ ఆ-ఈ మరియు 490/527/ అ-ఉ విస్తీర్ణం ఎ. 1-08 గుంటల భూమిని దాని పట్టాదారైన కుదుముల హన్మంతు గౌడ్ S/o చిన్న పెంటయ్య R/o ఇంటి.నం: 13-09, తాళ్ళగూడ గ్రామము, నందిగామ మం॥ రంగారెడ్డి జిల్లా గార్ల నుండి కొనుటకు ఒప్పందం కుదుర్చుకొని పెద్ద మొత్తములో డబ్బులు బయానాగా ఇచ్చి వున్నారు. కావున నా క్లైయింటు ఇప్పుడు పై భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు సన్నద్ధం అవుతున్నారు కావున పై తెలిపిన భూమిపై ఎవ్వరికైనా ఎలాంటి ఆక్షేపణలు లేదా హక్కులు వున్నచో క్రింద తెలిపిన చిరునామాలో ఈ రోజు నుండి 10రోజులలో తగిన ఆధారాలతో సంప్రదించగలరు లేనిచో ఎలాంటి ఆక్షేపణలు లేవని తలంచి రిజిస్ట్రేషన్ చేసుకొను బడును గడువు తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

హద్దులు: తూర్పు : రోడ్డు, పడమర : కావలి క్రిష్ణయ్య భూమి, ఉత్తరం : మల్లాపూర్ మెయిన్ రోడ్డు, దక్షిణం : రమేష్ మరియు మల్లేష్ భూమి.

M. ప్రవీన్ కుమార్, న్యాయవాది, ఇంటి నం: 13-352, కొత్త కోర్టు బిల్డింగ్ ఎదురుగా షాద్‌నగర్ టౌన్, రంగారెడ్డి జిల్లా.

బహిరంగ ప్రకటన

తేది: 13-09-2023

మహమ్మద్ తహసీన్ పాషా తండ్రి యం.డి రషీద్, మహబూబ్‌నగర్ టౌన్ నివాసి, ప్రస్తుతం షాద్‌నగర్ టౌన్ నివాసి అని మరియు మహబూబ్‌నగర్ నుండి షాద్‌నగర్‌కు అతని ఇంటి షిఫ్ట్ చేసేటప్పుడు అతని రిజిష్టర్డ్ సేల్ డీడ్ నం: 2874/2023 ద్వారా కొనుగోలు చేసిన ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ మున్సిపాలిటీలోని సర్వే నం: 720లోని అతని ఆస్తి అంటే ప్లాట్ నం 48లోని 140.00 చ.గజాల విస్తీర్ణంగల అతని ఒరిజినల్ రిజిష్టర్డ్ సేల్ డీడ్ నం 1054/1999 (లింక్ డాక్యుమెంట్)ను అతను పోగొట్టుకున్నారని సాధారణ ప్రజలకు ఇందుమూలముగ తెలియచేయడమైనది. ఇది ఇలా ఉండగా అతను తన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్‌ను పోగొట్టుకున్నాడు. సదరు సేల్ డీడ్ ఎవరి స్వాధీనంలో నైన కలిగి ఉన్న లేదా ఏదేని అభ్యంతరాలు, హక్కులు లేదా క్లెయిమ్‌లు కలిగి ఉన్న వారు (7) రోజులలోగా దిగువ సంతకందారును సంప్రదించవచ్చును. అట్టి క్లెయిమ్‌లు అందనట్లయితే సదరు ఆస్తిపైన అభ్యంతరాలు, హక్కులు లేదా క్లెయిమ్‌లు లేవని భావిస్తూ మరియు సదరు సేల్ డీడ్ వాస్తవంగ పోయినవని భావిస్తూ తమనిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తికి బ్యాంకు ఋణం ప్రాసెస్ చేస్తుంది మరియు ఎటువంటి తదుపరి క్లెయిమ్‌లు/హక్కులు స్వీకరించబడవు.

సం/- రాజమోలి వెంకట రామిరెడ్డి అడ్వకేట్, ఇంటి.నం: 7-4-14, 7-4-14/ఎ, గ్యాలాక్సీ హై స్కూల్ ఎదురు లేన్ , వెంకటేశ్వర కాలనీ, మహబూబ్‌నగర్ సెల్: 9963887711.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందవందరగా పడున్న బీరువాలోని సామగ్రి

యాచారం: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం మండలం నందివనపర్తి గ్రామానికి చెందిన కొండాపురం కళమ్మ (పీఏసీఎస్ డైరెక్టర్)కు అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఆమెను నగరంలోని ఆస్పత్రిలో చేర్పించారు. అమావాస్య సందర్భంగా గురువారం సాయంత్రం కొడుకు శ్రీశైలం.. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి దర్శనం కోసం వెళ్లగా, ఆయన భార్య సుష్మ ఆస్పత్రిలో ఆయన తల్లి కళమ్మ వద్ద ఉంది. పుణ్యక్షేత్రం నుంచి శనివారం సాయంత్రం గ్రామానికి చేరుకుని ఇంట్లోకి వెళ్లబోగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ గోపాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బీరువాలో దాచిన రూ.2 లక్షలు నగదు, నాలుగు తులాల బంగారు గొలుసులు, ముఖ్యమైన పత్రాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీం అధికారులు వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

'రోడ్డు నిర్మాణంతో భూమి కోల్పోయాం'

శంకర్‌పల్లి: తమ భూమిలో నుంచి అక్రమంగా రోడ్డు వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కంట్రీ సైడ్ వెంచర్ యజమాని మసూద్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలోని మణి గార్డెన్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను 2007లో మోకిల గ్రామ సర్వే నంబర్ 98, 99లో 19.20 ఎకరాల భూమిని కొనుగోలు చేశానని తెలిపారు. వెంటనే డీటీసీపీ కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్‌పీ నంబర్ ఇచ్చారన్నారు. కానీ సదరు భూమి హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చిందంటూ 2010- 11లో డీటీసీపీతో పాటు ఎల్‌పీ నంబర్‌ను రద్దుచేశారని తెలిపారు. ఇదిలా ఉండగా 2018లో లాపాలామా(ఈఐపీఎల్) వెంచర్ నిర్వాహకులు 2020 జూన్ 6న తమ భూమిలో నుంచి అక్రమంగా రోడ్డు నిర్మించారని ఆరోపించారు. ఈ విషయమై తాను గతంలోనే కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.

PUBLIC NOTICE

My clients **Mrs. ADDULA HYMAVATHI, W/O ADDULA RAJENDAR REDDY** has entered into an agreement of sale with: Sri. RAM DHWANI SHARMA S/O BANKE LAL SHARMA pertaining to the land of bearing Plot No. 59 admeasuring 262 Sq Yards in Sy. No. 589, situated at Nadergul Village, Balapur Revenue Mandal, Ranga Reddy District, under Badangpet Municipal Corporation Telangana State., and paid substantial advance sale consideration to the original owner and proceeding for registration.

If any person/s having any objection for the above sale transaction, may file their objections to the undersigned within one week along with necessary documents, failing which it shall be deemed that there are no objections from any quarter and the sale transactions will be finalized and thereafter, no objection of what-so reason will be entertained.

Sd/- **JAGGARI MANIKANTA REDDY**
ADVOCATE
H.No.1-5-80, II Floor, New Maruthi Nagar, Kothapet, HYDERABAD-500 035.
Phone: 9949520282

మట్టి ప్రతిమలకే మొగ్గు

- కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు
- రసాయన గణపతి విగ్రహాలకు ఆసక్తి చూపని భక్తులు
- గణేశ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి లంబోదరుల పంపిణీ
- రేపు చవితి నవరాత్రోత్సవాలు



మొయినాబాద్‌రూరల్: అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి గణపతులు

మొయినాబాద్‌రూరల్: భక్తులు ప్రప్రథమంగా పూజ చేసేది ఆదినాయకుడు గణనాథుడికే. చవితి నవరాత్రులు సమీపిస్తున్న వేళ.. పూజాసామగ్రి, విగ్రహాలను విక్రయించే దుకాణాలు క్రయవిక్రయ దారులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా కాలుష్య నియంత్రణకు ప్రజలు తమ వంతుగా రసాయనలేమి విగ్రహాలను కొలిచేందుకు మక్కువ చూపుతున్నారు.

భారీగా విగ్రహాల తయారీ

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లో 15 సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను రాష్ట్ర ప్లే గణేశ్ సొసైటీ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారు. అదే వృత్తిగా మలచుకొని ఉపాధి పొందుతూ.. పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. మట్టి విగ్రహాలకు పట్టణాలు, పల్లెల్లోనూ ఆదరణ లభించడంతో ఆర్డర్లు తీసుకొని సైజు, వివిధ ఆకారాల్లో తయారు చేసి వారి ఇంటికి, కార్యాలయాలు, దుకాణాలకు పంపించడం గమనార్హం. ముఖ్యంగా ట్యాంక్‌బండ్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా దాదాపు మూడు లక్షల మట్టి వినాయకులను తరలిస్తున్నారు.

మట్టి వినాయకున్నే పూజిద్దాం..

చేవెళ్ల: మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని పర్యావరణ వేత్తలు, విద్యావంతులు ప్రచారం చేస్తున్నారు. ప్రపంచాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య పర్యావరణ కాలుష్యమని, ఈ ప్రభావం సమస్త జీవకోటిపై పడుతుందని ఆవేదన చెందుతున్నారు. రేపు చవితి సందర్భంగా పరిమాణంతో సంబంధం లేకుండా మట్టి ప్రతిమలనే పూజించాలని కోరుతున్నారు. రంగులతో చేసిన విగ్రహాల నిమజ్జనం కారణంగా 10వేల టన్నుల రసాయన వ్యర్థాలు భూమిలో చేరుతున్నాయని, భూమ్మీద ఉన్న 71శాతం జలరాశిలో 68శాతం సముద్ర జలాలే ఉన్నాయని పర్యావరణ ప్రేమికులు తెలిపారు. విగ్రహాల తయారీలో ఇనుము, కృత్రిమ రంగుల వాడకంలో పాదరసం, క్రోమియం, సీసం, కాడ్మియం తదితర విషపూరిత రసాయనాలను వాడుతున్నారని, ఈ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయటం ద్వారా.. ఆ నీటిని పశువులు, పక్షులు తాగటం వలన అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇవే నీటిని ప్రజలు ఉపయోగించటంతో రకరకాల వ్యాధుల బారిన పడుతున్నారని విద్యావేత్తలు, వైద్యులు ఆందోళన చెందుతున్నారు. కాలుష్యాన్ని నివారించాలన్నా.. జీవరాశులను కాపాడుకోవాలన్నా.. మట్టి విగ్రహాలను పూజించాలని పలువురు కోరుతున్నారు.

రుణం ఇస్తే బాగుంటుంది



గణేశ్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల తయారీ విస్తృతంగా జరుగుతోంది. ఈ యేడు సుమారు 4 లక్షలకు పైగా అర ఫీటు నుంచి ఆరు ఫీట్ల ఎత్తు వరకు విగ్రహాలను తయారు చేసి, రూ.50 నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నాం. ఇందులో ప్రభుత్వానికి మూడు లక్షలకు పైగా సరఫరా చేయనున్నాం. ఆర్థికంగా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తే బాగుంటుంది. కుటుంబ పోషణతో పాటు పలువురికి ఉపాధి దొరుకుతుంది. ఇలాంటి సంస్థలను ప్రభుత్వం గుర్తించాలి.

– కుమ్మరి మంజుల, సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు

కాలుష్య భూతాన్ని తరిమికొట్టండి



చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి. అదే సమయంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. అందుకు మట్టి విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయాలి. 19 ఏళ్లుగా మట్టి గణపతులను తయారు చేయించి ప్రజలకు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నాను. ప్రతి ఒక్కరు మట్టి ప్రతిమలను పూజించి కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలి.

– పి.రామకృష్ణారావు, పర్యావరణ వేత్త, చేవెళ్ల

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.